నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, గురువారం 7 నవంబర్ 2024 | WARANGAL

నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ

ములుగు మెడికల్ కాలేజీలో మూడు పోస్టుల నియామకం

ఒక్కో పోస్టుకు రూ. 3లక్షల వసూలు

ములుగు, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ములుగు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను అధికారులు చేపట్టారు. త్వరలో ప్రారంభం కానున్న మెడికల్ కాలేజీలో రెండు ఎలక్ట్రీషియన్‌తో పాటు ఒక ప్లంబర్ పోస్టుల నియామకాల్లో పెద్ద ఎత్తున పైరవీలు చోటుచేసుకున్నాయి. దళారులు, ఉన్నతాధికారుల అండదండలతో ముడుపులు తీసుకొని రాజకీయ పైరవీలతో భర్తీ చేయిస్తున్నారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌తో ప్లంబర్, ఎలక్ట్రీషియన్ కావాలని ఇన్‌చార్జి ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌కు లేఖ రాయించారు. దళారులు ఆ అధికారిని ప్రసన్నం చేసుకొని కలెక్టర్ పంపించినట్లుగా ముగ్గురు వ్యక్తుల పేర్లను జోడించి ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ ద్వారా ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి నియామక ఉత్తర్వులను పంపించారు.

ఒక్కో పోస్టుకు రూ. 3లక్షల వసూలు

సంబంధిత ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ వారు నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తాం.. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్‌ను అడిగారు. దీంతో ఆయన తాను చెప్పినట్టుగా ఆ ముగ్గురికి ఉద్యోగాలు కల్పించాల్సిందేనని, లేకపోతే ఇతర ఏజెన్సీ ద్వారా భర్తీ చేస్తానని బెదిరించడంతో చేసేదేమీ లేక ముగ్గురికి ఏజెన్సీ ద్వారా నియామక పత్రాలను అందజేశారు. ప్లంబర్‌గా జాకారం గ్రామ మాజీ సర్పంచ్‌తో పాటు జిల్లా కేంద్రానికి చెందిన మరో ఇద్దరిని ఎలక్ట్రీషియన్లుగా నియమించారు. విషయం బయటికి తెలియడంతో పలువురు నిరుద్యోగులు అధికారులను కలిసి అడిగేందుకు ప్రయత్నం చేయగా పొంతన లేని సమాధానాలు చెప్తూ దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గతంలో భర్తీ చేసిన 32 పోస్టుల్లో సైతం పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయని వార్తాపత్రికల్లో కథనాలు రావడంతో కొందరు అర్హులైన నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి. కాగా, ప్రస్తుతం ఈ మూడు ఉద్యోగాల భర్తీలో దళారులు ఒక్కో ఉద్యోగానికి రూ. 3లక్షల చొప్పున వసూలు చేసి కింద నుంచి పైస్థాయి వరకు పంపిణీ చేసినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ తుల రవిని వివరణ కోరగా ప్రస్తుతం నియామకం చేసిన మూడు పోస్టులు అన్‌స్కిల్డ్ పోస్టులు అయినందున ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే భర్తీ చేశామని తెలిపారు.

జనగామ కలెక్టరేట్‌లోని భూ సేకరణ విభాగంలో..

జనగామ చౌరస్తా: జనగామ జిల్లా కలెక్టరేట్‌లోని భూ సేకరణ విభాగం యూనిట్ 1లో ముగ్గురు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నేరుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా రిక్రూట్ చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా, గతంలో కలెక్టర్‌గా పని చేసిన శివలింగయ్యకు నోట్ ఫైల్ సమర్పించకుండా, రోస్టర్ పాయింట్లు పాటించకుండా ముగ్గురికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిసింది. ఈ నియామకాల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసినిని వివరణ కోరగా టెంపరరీగా వారిని విధుల్లోకి తీసుకున్నామని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారానే వారికి వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ సూచనల మేరకు గత కలెక్టర్‌కు నోటి మాట ద్వారా ఈ విషయాన్ని చెప్పిన తర్వాతే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా రిక్రూట్ చేసుకున్నామని తెలిపారు.

108లో ఈఎంటీ ఉద్యోగ నియామకాలకు దరఖాస్తులు

కాజీపేట, నవంబర్ 6 : రాష్ట్రంలోని 108 వాహనాల్లో ఖాళీగా ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) ఉద్యోగ నియామకాల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా మేనేజర్ పాటి శివకుమార్ తెలిపారు. కాజీపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ 108 వాహనంలో ఈఎంటీ నియామకాలకు ఆసక్తి గల అభ్యర్థులు హనుమకొండలోని మెటర్నిటీ దవాఖానలోని 108 కార్యాలయంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులను నేరుగా అందజేయాలన్నారు. అభ్యర్థులు 30 ఏండ్ల లోపు వయస్సు కలిగి, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ కోర్సులతో పాటు బీఎస్సీ లైఫ్ సైన్సెస్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఉద్యోగం వచ్చాక రాష్ట్రంలోని ఏ జిల్లాలోనైనా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అమాత్యులు చెప్పినా పనులకు అతీగతీ లేదు. ప్రభుత్వంలో కీలక మంత్రిగా చెప్పుకుంటున్న సీతక్క ములుగు జిల్లాలో సర్కిల్ ఆఫీసు ఏర్పాటుకు పంపిన ప్రతిపాదనను నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ (టీజీఎన్పీడీసీఎల్) పూర్తిగా పక్కనబెట్టింది. మేడారం జాతరకు ముందే ప్రతిపాదనలను పంపడంతో పాటు పలుమార్లు సంస్థ అధికారులపై ఒత్తిడి తెచ్చినప్పటికీ పెద్దగా పట్టించుకోవడంలేదు. 2026లో జరిగే మేడారం జాతర వరకైనా ములుగు జిల్లాలో ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఏర్పాటయ్యేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

- వరంగల్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మంత్రి చెప్పినా అతీగతీ లేదు!

- ములుగు సర్కిల్ కోసం సీతక్క ప్రతిపాదనలు
- ఏడాది గడుస్తున్నా పట్టించుకోని సంస్థ
- కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు కాని అమాత్యుల ప్రపోజల్స్

ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఏర్పాటుపై జాప్యం

ప్రజల కేంద్రంగా పరిపాలన అందించడమే లక్ష్యంగా కేసీఆర్ ప్ర భుత్వం 2016 అక్టోబర్‌లో జిల్లాల పునర్విభజన చేపట్టింది. ఆ తర్వాత అన్ని ప్రభుత్వ శాఖలు దీనికి అనుగుణంగా మార్పులు చేశాయి. టీజీఎన్పీడీసీఎల్ సైతం గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలో మాత్రమే ఉండే సర్కిల్ వ్యవస్థను కొత్త జిల్లాల్లోనూ ఏర్పాటు చేసింది. స్థానికంగానే పర్యవేక్షణ ఉండడంతో కరెంటు సరఫరా వ్యవస్థ మెరుగుపడింది. అనంతరం కేసీఆర్ 2019 ఫిబ్రవరి 17న ములుగు జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు భూపాలపల్లి జిల్లాలో భాగంగా ఉన్న ములుగు జిల్లా ప్రాంతానికి ప్రత్యేకంగా సర్కిల్ ఆఫీసు ఏర్పాటు చేసే ప్రతిపాదనలపై అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస ప్రతిపాదనలూ పంపలేదు. ఆదివాసీ ప్రాంతం కావడం, మేడారం జాతర ప్రదేశం ఉండడంతో ములుగు జిల్లాకు ప్రత్యేకంగా సర్కిల్ ఆఫీసు ఉండాలని ప్రజలు, రైతుల నుంచి డిమాండ్ మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సీతక్క దీనిపై టీజీఎన్పీడీసీఎల్‌కు ప్రతిపాదనలు పంపగా పక్కనబెట్టింది.

టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో 18 జిల్లాలు

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్(టీజీఎన్పీడీసీఎల్) పరిధిలో వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల, ఆదిలాబాద్, మంచి ర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిలాలు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లాలో కరెంటు సరఫరా కోసం ప్రత్యేకంగా సహకార పంపిణీ వ్యవస్థ ఉన్నది. ములుగు జిల్లాలో మినహా అంతటా ప్రత్యేకంగా సర్కిల్ ఆఫీసులు ఉన్నాయి. సీతక్క ప్రస్తుతం ములుగు ఎమ్మెల్యేగా, రాష్ట్ర క్యాబినెట్‌లో కీలక మంత్రిగా ఉన్నారు. ఈ జిల్లాలో సర్కిల్ ఆఫీ సు అంశం ఏర్పాటుపై టీజీఎన్పీడీసీఎల్ పట్టించుకోవడంలేదు.

కలప స్మగ్లర్లపై కఠిన చర్యలు

- వరాల గుట్ట వద్ద బేస్ క్యాంపును ఏర్పాటు చేస్తాం
- ములుగు ఎఫ్ఆర్వో డోలి శంకర్

నమస్తే ఎఫెక్ట్

వరాల గుట్టపై టేకు చెట్లను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో శంకర్, అటవీ శాఖ సిబ్బంది

ములుగురూరల్, నవంబర్ 6 : కలప స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిని త్వరలో గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వో డోలి శంకర్ అన్నారు. బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'స్మగ్లర్లకు వరాల గుట్ట.. టేకు కలపపై కన్నేసిన దొంగలు' కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ములుగు జిల్లా ములుగు మండలం బరిగలాపల్లిలో ఉన్న వరాల గుట్టను బుధవారం సిబ్బందితో కలిసి ఎఫ్ఆర్వో డోలి శంకర్ సందర్శించారు. గుట్టపై ఉన్న టేకు చెట్లను, స్మగ్లర్లు కట్ చేసిన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్టపై 10చెట్లను ఇటీవల కాలంలో కట్ చేసిన అనవాళ్లు ఉన్నాయని అన్నారు. గ్రామంలో మరో 10టేకు సైజులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వరాల గుట్టను ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొన్ని నెలల క్రితం మెట్ల మార్గాన్ని 1.5 కిలోమీటర్ల మేర నిర్మించామని పేర్కొన్నారు. గుట్టపై ట్రెక్కింగ్‌ను ఏర్పాటు చేసి సుమారు 20 గుడారాలను ఏర్పాటు చేయనున్నామని, దీని ద్వారా గుట్టపై జన సంచారం ఉండనున్నందున స్మగ్లింగ్ లాంటివి జరిగే అవకాశం ఉండదని తెలిపారు. దీంతో పాటు బేస్ క్యాంపును సైతం ఏర్పాటు చేసి గుట్ట వద్ద నిఘాను పెంచనున్నట్లు ఆయన వివరించారు. కలప స్మగ్లింగ్‌తో తమ శాఖ సిబ్బంది కానీ, అధికారులు కానీ ఉన్నట్లు తెలితే శాఖాపరమైన చర్యలు తప్పవని, ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని అన్నారు.

గుప్త నిధుల తవ్వకాలు కూడా..

వరాల గుట్టపై కలప స్మగ్లింగ్‌తో పాటు గుప్త నిధుల తవ్వకాలు జరుగుతున్నాయని జోరుగా ప్రచారం జరుగుతున్నది. కాకతీయుల కాలంలో సైనిక స్థావరంగా వరాల గుట్ట వెలుగొందింది. దీంతో పాటు పూర్వం ఓ జమీందారు రామప్ప సరస్సు శివారులో మక్కజొన్న పంట సాగు చేస్తే ఆ పంటకు బదులు వజ్రాలు, బంగారం పంట పండిందని, ఆ సొమ్మునంతా అతను వరాల గుట్టపైకి చేర్చినట్లు ప్రాచుర్యంలో ఉంది. అయితే ఈ ప్రచారాన్ని ఆసరా చేసుకున్న కొందరు వరాల గుట్ట చుట్టూ గుప్త నిధులు దొరకుతాయని తవ్వకాలు జరిపినట్లు సమాచారం. అక్కడ తవ్విన ఆనవాళ్లు ఉన్నాయని, గుట్టపై అధికారుల పర్యవేక్షణ కొరవడిన మూలంగానే ఈ పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గుట్ట రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కల్తీ లేని ఆహారం.. పోషకాహారంపై చైతన్యం

- 18, 19 తేదీల్లో నిజామాబాద్‌లో వినియోగదారుల హక్కులపై జాతీయ సదస్సు
- సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి

సమావేశంలో మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

నెక్కొండ, నవంబర్ 6 : కల్తీ లేని ఆహారం అందించడం.. వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడిన కన్జూమర్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సంస్థ ప్రజలను చైతన్యపరుస్తున్నదని సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి వెల్లడించారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల హక్కులపై ఈ నెల 18, 19 తేదీల్లో నిజామాబాద్‌లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 14 నుంచి ప్రారంభమైన ఈట్ రైట్ ఫుడ్ అనే అంశంపై మూడు నెలలపాటు నిర్వహిస్తున్న సర్వే, ప్రజలను చైతన్యపర్చడంలో భాగంగా జాతీయ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 18న వినియోగదారుల ప్రతినిధుల జాతీయ కమిటీ గవర్నింగ్ కౌన్సిల్ జరుగుతుందని, దీనికి వివిధ రాష్ట్రాలకు చెందిన 53 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. చీఫ్ పాట్రన్ డాక్టర్ అనంత శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, జాతీయ అధ్యక్షురాలు ప్రీతి పాండ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు సెల్వరాజు ఆధ్వర్యంలో జరిగే కౌన్సిల్‌లో వినియోగదారుల హక్కుల పరిరక్షణపై పలు తీర్మానాలు చేయనున్నట్లు చక్రపాణి తెలిపారు. 19న ఆహారంలో కల్తీలేని ప్రభుత్వ విధానాలు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల బాధ్యత అనే అంశంపై సదస్సు జరుగుతుందన్నారు. సూక్ష్మ పోషకాలను అదనంగా కలిపి ఫోర్టిఫైడ్ రైస్, వంట నూనెలు, వనస్పతి, పాలు, పాలపొడి నాణ్యతలో బ్యూరో ఆఫ్ ఇండియన్ నాణ్యతా ప్రమాణాలు, పౌరసరఫరాలశాఖ, లీగల్ మెట్రాలజీ, ఆహార కల్తీ నిరోధకశాఖ, ఐసీడీఎస్, అగ్‌మార్క్ , ఔషధ నియంత్రణ శాఖ, బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ముఖ్య పాత్రపై సదస్సులో చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సులో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, వినియోగదారుల ప్రతినిధులు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులు పాల్గొనాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ కోరారు.

మేం కుటుంబ సర్వే చేయం

- ఆర్డర్ కాపీ ఇచ్చి వేతనం నిర్ణయించాలి
- కలెక్టరేట్, కమిషనర్ చాంబర్ ఎదుట ఆర్పీల ఆందోళన

హనుమకొండ కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ పట్టణ ఆర్పీలు

హనుమకొండ/వరంగల్, నవంబర్ 6 : ఎలాంటి ఆర్డర్ కాపీ లేకుండా కుటుంబ, కుల గణన సర్వే చేయమనడం సరైంది కాదని, ఇందులో తాము పాల్గొనమని ఐకేపీ పట్టణ ఆర్పీలు స్పష్టం చేశారు. ఈ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం హనుమకొండ కలెక్టరేట్, బల్దియా కమిషనర్ చాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ కుల గణన సర్వే చేయాలంటే ఆర్డర్ కాపీ ఇచ్చి వేతనం నిర్ణయించాలన్నారు. ఈ విషయంలో కలెక్టర్ తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బకాయి వేతనాలు తక్షణమే ఇవ్వాలని, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 164 జీవోను తొలగించడంతో పాటు ఆర్పీలకు రూ. 26వేల వేతనం ఇస్తూ, అంద రికీ గుర్తింపు కార్డులు, ఏడాదికి నాలుగు జతల యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబ, కుల సర్వేకు ఆర్‌పీలకు స్థానిక డివిజన్లలో కాకుండా గ్రేటర్‌లోని వేరే ప్రాంతాల్లో డ్యూటీలు వేయడంతో ఆర్‌పీలు సర్వేకు వెళ్లేది లేదని మొండి కేశారు. తమ గోడును కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు చెప్పుకునేందుకు వస్తే తమను పట్టించుకోకుండా వెళ్లడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో మేయర్ గుండు సుధారాణిని కలవగా అధికారులతో చర్చించి వారి డివిజన్లలోనే డ్యూటీలు వేసేలా చర్యలు తీసుకోవాలని అదేశించారు. తొలి రోజు గ్రేటర్‌లోని 66 డివిజన్లలో జరిగిన సర్వేకు ఆర్‌పీలు దూరంగా ఉన్నారు. వరంగల్ ప్రాంతంలో వారు మెటీరియల్ సైతం తీసుకోకపోవడం గమనార్హం. కార్యక్రమంలో డీ సునీత, ఎం శ్రీదేవి, ఝాన్సీ రాణి, సరస్వతి, నిడిగొండ రజిత, నాగమణి, ధనలక్ష్మి, విజయ రాణి, విజయ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోకుల్ సదర్

- భారీగా తరలివచ్చిన యాదవులు
- ఆకట్టుకున్న దున్నపోతుల విన్యాసాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్వీ నాయకుల మధ్య ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

సదర్ సమ్మేళనంలో దున్నపోతుల విన్యాసాలు

అభివాదం చేస్తున్న యాదవులు, ప్రజాప్రతినిధులు

ఇరు వర్గాలను అడ్డుకుంటున్న పోలీసులు

హనుమకొండ, నవంబర్ 6 : గోకుల్ సదర్ సమ్మేళనం బుధవారం రాత్రి హనుమకొండ పాత బస్ డిపో ఎదుట అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద ఎత్తున పార్టీలకతీతంగా యాదవులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తమ సంస్కృతీసంప్రదాయాలను ప్రదర్శించారు. ముఖ్యంగా దున్నపోతుల విన్యాసాలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఇప్పటి వరకు హైదరాబాద్ నగరానికే పరిమితమైన గోకుల్ సదర్ సమ్మేళనం మొట్టమొదటిసారి ఇక్కడ నిర్వహించడంతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. వచ్చిన అతిథులకు యాదవులు పగడిని అందజేశారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రాజ్యసభ్యుడు మాందాటి అనిల్‌కుమార్ యాదవ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, యాదవ నాయకులు సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, బంక సంపత్, రాజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ రోజు చారిత్రకమైన దినం అన్నారు. యాదవులకు అండగా నిలవాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి గోకుల్ సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించి జీవో జారీ చేశారని, అందుకు సీఎంకు యాదవుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

స్వల్ప ఉద్రిక్తత

గోకుల్ సదర్ సమ్మేళన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ముఖ్య అతిథులు మాట్లాడుతున్న క్రమంలో స్టేజి ముందున్న కాంగ్రెస్, బీఆర్ఎస్వీ వర్గాలు స్టేజీపైకి వెళ్లేందుకు ఒకరిని ఒకరు తోపులాడుకున్నారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి ఘర్షణ పడ్డారు. దీంతో అక్కడ ఏం జరుగుతుందోనని వచ్చినవారు ఆందోళన చెంది పరుగులు తీశారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. గొడవపడ్డ వారిని అక్కడి నుంచి బయటకు పంపించడంతో సద్దుమణిగింది. ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేసిన నిర్వాహకులు ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని యాదవులే అనుకోవడం గమనార్హం. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన లడ్డూ యాదవ్, నిర్వాహకులు బంక సంపత్ యాదవ్, మూగల కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, మామిళ్ల రాజుయాదవ్, జక్కుల రవీందర్ యాదవ్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన యాదవ నాయకులు, యాదవులు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడోత్సవాలను జయప్రదం చేయాలి

సోషల్ వెల్ఫేర్ గురుకులం ప్రిన్సిపాల్ సరిత

గురుకులంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సరిత

రాయపర్తి, నవంబర్ 6 : మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలల ఆవరణలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న పదో జోనల్ స్థాయి క్రీడోత్సవాలను జయప్రదం చేయాలని మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం ప్రిన్సిపాల్ సరిత బుధవారం కోరారు. జోనల్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లోని 14 బాలికల గురుకులాలకు చెందిన 1190 క్రీడాకారిణులు జోనల్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, చదరంగం, క్యారమ్స్‌తోపాటు అథ్లెటిక్స్‌లో రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, త్రో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు జిల్లాలకు చెందిన డీసీవోలు, జెడ్వో, మల్టీ జోనల్-1 ఆఫీసర్‌తోపాటు 14 గురుకులాల ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, కేర్ టేకర్లు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో గురుకుల బోధన సిబ్బంది అలుగు రమ్యసుధ, సృజన, కల్పన, కళమ్మ, వేణు, జ్యోతి, కల్పన పాల్గొన్నారు.

ములుగు కలెక్టర్ పేర ఫేక్ మెసేజ్‌లు

- ఫేస్‌బుక్ ఐడీతో సైబర్ నేరగాళ్ల మోసాలు
- ఫర్నిచర్ తక్కువ ధరకు కొనాలని సూచన



ములుగు, నవంబర్ 6 (నమస్తేతెలంగాణ) : సైబర్ నేరగాళ్లు రోజుకో తీరున మోసాలకు పాల్పడుతున్నారు. నిన్న మొన్నటి వరకు సామాన్య ప్రజలకు బ్యాంకు రుణాలు మంజూరయ్యాయని, లాటరీలు తగిలాయని ఫోన్లు చేసి ఓటీపీలు తెలుసుకొని ఆర్థిక నేరాలకు పాల్పడే వారు. తాజాగా ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాక ర పేరు, ఫొటోతో ఫేస్‌బుక్‌తో ఐడీని సృష్టించి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారి ఖాతాలకు ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. వారు ఆక్సెప్ట్ చేసిన అనంతరం మెస్సెంజర్‌లో మెసేజ్‌లు పంపిస్తున్నారు. ఇటీవల ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన ఓ జర్నలిస్టుకు ఫేస్‌బుక్‌లో సైబర్ నేరగాళ్లు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించారు. జిల్లా కలెక్టర్ పేరుతో ఉన్న ఐడీని చూసిన సదరు జర్నలిస్టు ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను ఆక్సెప్ట్ చేశాడు. వెంటనే మెసెంజర్‌లో కలెక్టర్ ఐడీ నుంచి కుశల ప్రశ్నలతో మొదలైన చాటింగ్ ఫోన్ నంబర్ అడిగి తెలుసుకున్నా డు. అనంతరం కలెక్టర్ ఐడీ నుంచి సీఆర్పీఎఫ్ అధికారిగా పనిచేస్తున్న సుమిత్‌కుమార్ అనే తన స్నేహితుడు బదిలీపై ఇల్లు మారుతున్నాడని, అతని ఇంట్లో ఉన్న ఫర్నిచర్ సామగ్రి మొత్తాన్ని తక్కువ ధరకు ఇప్పిస్తానని కలెక్టర్ ఐడీ నుంచి మెసేజ్ పంపించారు. దీంతో అవాక్కైన సదరు జర్నలిస్టు ఐడీ ఫేక్‌గా గుర్తించారు. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని గ్రహించి అంతటితో మెసేజ్‌లను పంపడం ఆపేశాడు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లగా ఫేక్ ఐడీగా కలెక్టర్ నిర్ధారించారు. ఫేక్ ఐడీ నుంచి వచ్చే మెసేజ్‌లకు ఎవరూ రెస్పాండ్ కావొద్దని ఆయన సూచించారు.